# జయ్‌హింద్

**శ్రీ సహజానంద**

కల్పనాసీమలో వెన్నెల తలుపులు తెరచుకొన్నయ్.

రంగు రంగుల పెద్ద అద్దం అతని ముందు తళ తళలాడుతోంది. ఆ అద్దంలో ఎన్ని ప్రతిబింబాలు ? ఎన్ని నీడలు తాచుపాములవలె బుసలుకొట్టి, పడగ విప్పుతయ్ ? పరాధీనమైన ఈ నీడల్లోనే మూలం యొక్క మర్మం దాగి, దాని వికృతం బహిర్గత మవుతుంది.

ఈ అద్దంలో నెమళ్ళు పింఛాలెత్తి నృత్యం చేస్తయ్ !

కోకిలల సంగీతం, ఛాయా నిశ్శబ్దంలో మూగవడిపోతుంది.

మనుష్యుడు, అతని అనాది నెచ్చెలి దుఃఖం . .ఇద్దరు నల్లని మేఘాల్లా .. జీవాన్ని చిచ్చులోకి ఈడ్చుకు వెళ్తున్న దుఃఖం భయంకర సర్పంలా ...మనుష్యుడొక కాటుతిన్న ఎలుకపిల్లలా.

* * *

కాల్పనిక జగత్తుకు రెండు ద్వారాలు.

ఒకటి స్వర్గం,

ఒకటి నరకం రెంటికి మృత్యువు ప్రాంగణం.

కాని కాని వాస్తవిక జగత్తుకు జీవం . జీవితం ... ప్రాణం. ఇదే సింహద్వారం.... ఇక్కడ నిలబడి విను.

అది సామవేదం !

ఇక్కడ నిలబడి చూడు !

అది కురుక్షేత్రం ! !

ఇక్కడ నువ్వు వ్రాసేదే భగవద్గీత! ఇక్కడ నువ్వు పాడేదే అధ్యాత్మం ! . .

* * *

రచయిత కాల్పనిక జగత్తు నుండి మరలి, వాస్తవికజగత్తుయొక్క సింహద్వారం వద్ద నిలబడ్డాడు. నిబిడమైన నిశిరాత్రి తెల్లవారబోతోంది. మహోదయం కాబోతోంది....

తూర్పున.... తూర్పున శూన్యంలో నెత్తురు చిందింది ! వెలుగు నెత్తురుతో మెరుస్తోంది ? ఎవరు? సూర్యబింబమా? కాలం గాయపడిన గుండెతో, ప్రాగ్దిశా గవాక్షంపై నిలబడ్డది....

ఏమది?

అది ... ఏమిటి ?

కాగితాలకింద ఒత్తుపెట్టుకున్న పుస్తకము జారి గచ్చుపై పడ్డది.... ఎర్ర సిరా మరకల్లో మెరుస్తోంది-

'August 9'

అహో ! అవును.... అది '42.... అది ఆగస్టు . అది 9. . .

చరిత్ర ఫాలతలంపై జ్యోతి లా వెలుగుతోంది !

తుపాకుల గుళ్ళు రంయ్‌మని దూసుకుపోయినయ్ !

తుపాకిగుళ్ళతో తూట్లుపడిన ఆపర్వ దినం నవభారతానికి జన్మదినం !

వందలకు వందలు యువకులు, వృద్ధులు ఆ మహా ..ఉషస్సుకు పూజ చేస్తున్నారు.

*　　*　　*

రచయిత తేరిపార చూచాడు . . అదొక మహానాటకం ! మందిరమంతా జనసముద్రంతో ఉప్పొంగుతోంది ! రంగంపై నిలబడిన వాళ్ళకు కిరీటాలు లేవు కత్తులు లేవు ... సీసపద్యాలు పాడటంలేదు వాళ్లు సామాన్యులు! ఉరి తాళ్ళవెంట పోయినవారు పోవగా మిగి లినవారు ! ప్రతిఘటనాభారంతో వారి నడుములు వంగినయ్ . . ఒకప్పుడు భుజంగాలు పగడలు విప్పిన ఆభుజాలు.

కిందకు వంగినయ్ ! వారిరెప్పల మధ్య మట్టుకు చిరుతపులి కన్ను తెర చింది ! పెద్ద తుపాకుల నీడలు రంగ స్థలాన్ని కమ్మివేసినయ్ !

రచయిత కల్లోలపడ్డాడు. సెలయేళ్లు ఉద్యానవనాలు విడిచిపెట్టి వచ్చాడు. అభి సారికలతని పాటకోసం నిరీక్షిస్తున్నారు. అటువంటి 'స్వర్గసీమ'ను విడిచిఈయజ్ఞ వేదిక దగ్గరకువచ్చాడు. అతనికి తోచ లేదు. నాటకం మంచి పట్టులోవుంది . . ప్రేక్షకులకళ్ళు రెప్పలు వాల్చటంలేదు. అశ్రువులు హృదయాగ్నిని చల్లార్చు కుంటున్నయ్ .

రచయిత బైటికివచ్చాడు. అది మహోదయంకాదు. అమావాస్య....నిశి రాత్రి దారి అగపడటంలేదు.

ఎవ్వరిదో అడుగుల అలికిడి అయింది ఏదో నీడ చటాలున చ[ర] చరా రాసుకుపోయింది. రచయిత కంగారు పడ్డాడు...

తెగిపడ్డది సంకెల...చీకట్లో భయాన్ని మోగించింది! నిలబడ్డాడు నిశాచరుడు! చినిగిన చొక్కా . మసక మసకగా కనబడుతోంది.... జుట్టు ఎండిన దుబ్బులావుంది.. కళ్ళు తోడేలు కళ్ళలా ...

రచయిత గుండె దడదడ కొట్టు కుంటోంది. కొంచెం దూరంలో ఇల్లు ఉంది. చక్కని డాబా ...చుట్టూ పూల మొక్కలు నాలుగు అంగలు వేస్తే

నిశాచరుడు రచయితకు నమస్క రించాడు. రచయిత ఆశ్చర్యపోయాడు. కబంధుడా ?

"నేను ఖైదీని 150 ఏళ్ళనుంచి ఈ కారా గృహంలో .... కోట గోడల్లో ప్రాణం పోక దేకుతున్నాను... నాకు పునర్జన్మ....ఆగస్టు 9 మళ్ళీనానాళాల్లో రక్తం హోరెత్తింది. కోటగోడలు నా కాళ్ళముందు పిట్టగోడలైనయ్.... వెనుక తుపాకులు పేలినయ్ వాటి ఆశీస్సు తోనే బైటపడ్డాను... వళ్ళంతా గాయ పడ్డది . . ఇక ఖైదీగా నే ఉండలేను . . ఈ జైలును పునాదులతో పెల్లగించి... సముద్రంలోకి విసరి పారవేసిననాడే నాకు స్వేచ్ఛ ! నేను చనిపోయానని మీరంతా అనుకొని వుంటే అనుకొని వుండవచ్చు. అది పొరబాటు.. నేను బతికి వున్నాను. నేను చనిపోలేదు, చనిపోను ... ఈ సంకెల తెగిపడ్డచోట

సింహాసనాన్ని స్థాపించాలి.. మీరంతా.. ముఖ్యంగా నువ్వు. ఈ భారం వహించాలి. .

నీ కలంలోంచి నిప్పు కురిపించు... నీ మాటలు గాండీవంలా మోగాలి.... నే వెళ్తున్నాను.. అదిగో . మహా నాటకం"

నిశాచరుడు చీకట్లో కలసిపోయాడు. తెగిన సంకెల మిణుగురు పురుగులా తళుక్కు మన్నది ఆ మెరుపులో ఖైదీ రక్తం పృధ్వీమాత ఒళ్ళో ఘోష పెట్టుతోంది.

'స్వాతంత్ర్యం' అని.

రచయిత హృదయంలో పిడుగులు ప్రతిధ్వనించినయ్ !

అతని కళ్ళముందు కోటానుకోట్లు కటకటాలు ఆకాశమెత్తునా లేచినయ్. పర్వతాలన్నీ దుమ్ము దులుపుకొని; కోటగోడల్లా లేచినయ్. భయంకరమైన శబ్దంతో అడవి సర్పంలా పడగెత్తింది. ఇనపతాచు- సంకెల .. 40 కోట్ల జీవ రాశిని ఉరితాడులా నొక్కుతోంది ... ఆ శృంఖలా సర్పం !

భూగర్భంలోంచి చీల్చుకొని పైకి లేచిన ఉరిస్తంభాలు మెడలు విరిగిన శవాల బరువుతో విరిగినయ్ !

రచయిత దహనమైపోతున్నాడు. ప్రతి అశ్రువు ఒకఅగ్నికణంలా దహించి వేస్తోంది....

రచయితహృదయం ఘోషపెట్టింది.

"స్వాతంత్ర్యం"

నలుదిశలు ప్రతిధ్వనించినయ్. ప్రజలు పాంచజన్యం పూరించారు !

విరోధికి విధి దూరాన 'గోరీ' తవ్వుతోంది.

జయ్‌హింద్

★

## ఆంధ్ర సాహిత్య పాఠశాల

"నేను విద్వాన్ పరీక్షయందు ఉత్తీర్ణుడనైనను సమగ్రమైన విజ్ఞానవంతుడను కాలేకపోయాను,"

"నేడు ప్రజా సాహిత్యముయొక్క అభ్యుదయ రీతులను గూర్చి ఉపన్యసించిన పండితులందరున్నూ తమ తమ ప్రాచీన వాఙ్మయానుభవములను విశదముగా ఉపన్యసించినారు ... ఈ ఉపన్యాసములు వినుటవలన నేను అభ్యుదయ రచనలు ప్రారంభించుటకు చాలా ఉత్సాహినైతిని. ఇందుమూలమున ఈ పాఠశాలా నిర్వహణము ధన్యమైనదని నేను భావించుచున్నాను."

విద్వాన్, వెల్లంకి బ్రహ్మయ్యచౌదరి.